క్లుప్తంగా

కొనసాగుతున్న ఆర్టీసీ ఉద్యోగుల ఆందోళన



ఏలేశ్వరంలో ఆందోళన చేస్తున్న ఆర్టీసీ ఉద్యోగులు

ఏలేశ్వరం: డిపో డ్రైవర్‌ను అక్రమంగా సస్పెన్షన్ చేయడాన్ని వ్యతిరేకిస్తూ ఆర్టీసీ ఉద్యోగులు చేస్తున్న ఆందోళనలు గురువారం కొనసాగాయి. డిపో జేఏసీ ఆధ్వర్యంలో డిపోగేట్ వద్ద ఉద్యోగులు ధర్నా చేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్థానిక ఆర్టీసీ డిపోకు చెందిన డ్రైవర్ ఎస్వీ రమణను 1/2009 సర్క్యులర్‌కు విరుద్ధంగా అక్రమ సస్పెన్షన్ చేశారన్నారు. ఉద్యోగులు 20 రోజులుగా ఆందోళనలు చేస్తున్న యాజమాన్యం స్పందించకపోవడం దారుణమన్నారు. డ్రైవర్‌ను విధుల్లోకి తీసుకునే వరకు ఉద్యమం తీవ్రతరం చేస్తామన్నారు. కార్యక్రమంలో ఎన్ఎంయూ డిపో కార్యదర్శి టి త్రిమూర్తులు, ఎంప్లాయిస్ యూనియన్ డిపో కార్యదర్శి యూబీఎం కుమార్, యునైటెడ్ ఎంప్లాయిస్ యూనియన్ డిపో కార్యదర్శి ఎస్పీరావు, అధిక సంఖ్యలో ఉద్యోగులు పాల్గొన్నారు.

యాంటెన్నా పరిజ్ఞానంపై విద్యార్థులకు అవగాహన



కార్యక్రమంలో మాట్లాడుతున్న ప్రొఫెసర్

గండేపల్లి: కమ్యూనికేషన్, రాడార్, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాలలో యాంటెన్నా పరిజ్ఞానం ఆవశ్యకతపై విద్యార్థులు అవగాహన పెంపొందించుకోవాలని ప్రగతి ఇంజినీరింగ్ కళాశాలల చైర్మన్ పి.కృష్ణారావు విద్యార్థులకు తెలియజేశారు. సూరంపాలెం ప్రగతి ఇంజినీరింగ్ కళాశాలలో గురువారం నిర్వహించిన యాంటెన్నా (తరంగ గ్రాహకం) రూపకల్పన, అనువర్తనాలపై గురువారం వర్క్‌షాప్ నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న జేఎన్‌టీయూకే అసిస్టెంట్ ప్రొఫెసర్ కొలిశెట్టి రమాదేవి మాట్లాడుతూ విద్యుత్ సంకేతాలను విద్యుదాయస్కాంత తరంగాలుగా మార్చడం ద్వారా యాంటెనాలు పనిచేస్తాయని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ ఎంవీ హరనాథబాబు తదితరులు పాల్గొన్నారు.

వేడుకగా సదస్యం

గండేపల్లి: తాళ్లూరు శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి వారి సదస్యం బుధవారం రాత్రి వేడుకగా జరిగింది. పాంచరాత్ర ఆగమ ప్రకారం స్వామివారి పూజలను పండితులు విశేషంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వేలాది మంది భక్తులు స్వామి వారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు అందుకున్నారు.

దేవాలయాల అభివృద్ధికి పనిచేస్తా

గండేపల్లి: జిల్లాలో దేవాలయాల అభివృద్ధికి, సిబ్బంది సమస్యల పరిష్కారానికి భక్తులకు మెరుగైన సేవలందిస్తానని జిల్లా దేవదాయశాఖ అధికారి ఈవీ సుబ్బారావు తెలిపారు. ఈయన బాధ్యతలు చేపట్టిన అనంతరం తొలిసారిగా పి.నాయకంపల్లిలోని రామాలయాన్ని గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ప్రాంతంలో తనిఖీదారుడిగా, సూపరింటెండెంట్‌గా పని చేసిన అనుభవంతో ఈ ప్రాంతంపై పూర్తి పట్టు, అవగాహన ఉందన్నారు. ఈయనకు మండల దేవదాయశాఖ అధికారి ఉండమట్ల రాజేష్, అర్చక సంఘం నాయకులు వీఎస్ఎన్ మూర్తి స్వాగతం పలికి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈయన వెంట తనిఖీదారు ఫణికుమార్, గ్రామస్తులు ఉన్నారు.

ఘనంగా వేంకటేశ్వర స్వామి గ్రామోత్సవం



కిర్లంపూడిలో వేంకటేశ్వరస్వామి ఊరేగింపు

కిర్లంపూడి: స్థానిక శ్రీదేవి భూదేవి కల్యాణ వేంకటేశ్వర స్వామివారి కల్యాణ మహోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. శనివారం స్వామివారి గ్రామోత్సవం నిర్వహించారు. అనంతరం పెంటకోట నాగబాబు, సత్యవేణి దంపతుల ఆధ్వర్యంలో స్వామి వారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, హోమాలు నిర్వహించారు. స్థానిక పరిసర గ్రామాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో స్వామివారిని దర్శించారు. ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

ఖాళీ స్థలాల పరిశీలన

గండేపల్లి: స్థానిక ఖాళీ స్థలాన్ని ట్రైనీ కలెక్టర్, ఇన్‌చార్జి ఆర్డీఓ సీహెచ్ భావన గురువారం పరిశీలించారు. గ్రామ శివారు రంగంపేట వెళ్లే మార్గంలోని పోలవరం గట్టును ఆనుకుని ఉన్న ఖాళీ స్థలాన్ని పరిశ్రమలకు అనుకూలంగా ఉంటుందేమోనన్న విషయంపై పరిశీలనకు వచ్చినట్టు ఆమె తెలిపారు. ఈమె వెంట తహసీల్దార్ శ్రీనివాస్, ఆర్ఐ సురేష్, వీఆర్వో అబ్బులు, సర్వేయర్లు, తదితరులు ఉన్నారు.

ఆత్మవిశ్వాసమే తొలిమెట్టు

- ప్రణాళికతో రాస్తే విజయం తథ్యం
- పరీక్షలకు సిద్ధంగా ఉన్న పది విద్యార్థులు
- 17 నుంచి వార్షిక పరీక్షలు ప్రారంభం



వి.కొత్తూరు గిరిజన ఆశ్రమ పాఠశాలలో ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయిని

తుని రూరల్: పబ్లిక్ పరీక్షలన్న భయాందోళనను, ఒత్తిడిని జయించి ఆత్మ విశ్వాసంతో పరీక్షలు రాస్తే విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించొచ్చని ఉపాధ్యాయులు, నిపుణులు పేర్కొన్నారు. ఈ నెల 17న ప్రారంభమయ్యే పదో తరగతి పరీక్షలు 31వరకు జరగనున్నాయి. ఈఏడాది ఏడు పేపర్లతో పరీక్షలు నిర్వహిస్తున్నారు. సిలబస్ పూర్తి చేసిన విద్యాశాఖ అధికారులు పరీక్షల నిర్వాహణకు పటిష్టమైన ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రణాళిక ప్రకారం సబ్జెక్టులు వారీగా సన్నద్ధమయితే విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధిస్తారన్నారు. ఆందోళనకు గురికాకుండ ప్రశ్నాపత్రాన్ని ఒకటికి రెండుసార్లు చదివి అర్థం చేసుకుని పరీక్ష రాయాలన్నారు. వంద రోజుల ప్రణాళికలో నిత్యం పాఠశాలలో రాసే పరీక్షలు గానే వార్షిక పరీక్షలను ప్రశాంతంగా రాయాలన్నారు. తుని నియోజకర్గంలో 40 ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలకు చెందిన 3752 మంది విద్యార్థులు పదో తరగతి పరీక్షలు రాయాల్సిఉండగా 19 పరీక్ష కేంద్రాలను అధికారులు ఏర్పాటు చేశారు.

ఇష్టంగా చదివితే ఉత్తమ ఫలితాలు

ప్రశాంత వాతావరణంలో ఇష్టంగా చదివితే ఉత్తమ ఫలితాలు సాధించవచ్చని విద్యార్థులకు ఉపాధ్యాయులు సూచిస్తున్నారు. పరీక్షలు రాసే ప్రతి విద్యార్థి ఆరోగ్యవంతంగా ఉండాలని, అందుకు అవసరమైన పౌష్టిక ఆహారం, నీరు సమయానికి తీసుకోవాలని, మానసిక ఒత్తిడి అనిపించినప్పుడు కొంతసేపు ప్రశాంతంగా నిద్రపోవాలన్నారు. కష్టమనిపించిన పాఠ్యంశాన్ని ఇష్టంగా చదివితే మంచి మార్కులు సాధించవచ్చన్నారు.

పరీక్షా కేంద్రాలు

తుని మండలంలో విద్యార్థులకు తుని పట్టణం రాజా ప్రభుత్వం ఉన్నత పాఠశాల, జెడ్పీ గరల్స్ హైస్కూల్, సీతారాంపురం మున్సిపల్ హైస్కూల్, సిద్ధార్థ, శ్రీచైతన్య, శ్రీప్రకాష్, భాష్యం స్కూళ్లతో పాటు ఎస్.అన్నవరం, తేటగుంట జెడ్పీ హైస్కూళ్లు, వి.కొత్తూరులో గిరిజన, ఎస్సీ ఆశ్రమ పాఠశాలలు, హంసవరంలో ఏపీ మోడల్ స్కూల్‌లో పరీక్షలు జరగనున్నాయి. తొండంగి మండలంలో విద్యార్థుల కోసం బెండపూడి, దానవాయపేట, తొండంగి, కె.పి.పురం జెడ్పీ హైస్కూళ్లు, కోటనందూరు మండలంలో విద్యార్థులకు కోటనందూరు, పి.కొట్టాం జెడ్పీ హైస్కూళ్లు, మదర్ విద్యా సంస్థలో పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశారు.

నియోజకవర్గంలో విద్యార్థులు, పరీక్షా కేంద్రాలు

మండలం	విద్యార్థులు	పరీక్షా కేంద్రాలు
తుని	2202	12
తొండంగి	950	4
కోటనందూరు	600	3
మొత్తం	3752	19

పరీక్షల షెడ్యూల్

17న మొదటి లాంగ్వేజ్, 19న రెండో లాంగ్వేజ్, 21న ఇంగ్లిషు, 24న గణితం, 26న ఫిజికల్ సైన్సు, 28న బయోలాజికల్ సైన్సు, 31న సామాజిక శాస్త్రం పరీక్షలు జరగనున్నాయి.

మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధిస్తా



సబ్జెకుల వారీగా చదువుకుంటున్నాను. ఉపాధ్యాయుల సూచనలు పాటిస్తూ రివిజన్ పూర్తి చేశాను. ఇప్పటికే నిర్వహించిన వివిధ రకాల పరీక్షలతో వార్షిక పరీక్షలన్న భయం పోయింది. ఆత్మవిశ్వాసంతో పరీక్షలు రాసి మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధిస్తాను.

– వియ్యపు నాగదుర్గ, విద్యార్థి, గిరిజన ఆశ్రమ పాఠశాల, వి.కొత్తూరు

ఆందోళన వీడితే ఉత్తమ ఫలితాలు



ఉపాధ్యాయులు, నిపుణుల సూచనలు పాటించి ఆందోళన వీడితే విద్యార్థులంత ఉత్తమ ఫలితాలు సాధిస్తారు. భయాందోళనలు పోగొట్టేందుకు వివిధ రకాలుగా విద్యార్థులను పరీక్షలకు సన్నద్ధం చేశాం. ధైర్యంగా పరీక్షలు రాస్తే ఉత్తమ ఫలితాలు సాధించవచ్చు.

– ఎం.వెంకటేశ్వరరావు, హెచ్ఎం, ఎస్.అన్నవరం

పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి



పదో తరగతి పరీక్షలు నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి చేశాం. ప్రశ్నాపత్రాలు తుని, అన్నవరం పోలీస్ స్టేషన్లలో భద్రపర్చాం. పరీక్షా కేంద్రాల్లో విద్యార్థుల సౌకర్యార్థం తాగునీరు, విద్యుత్, సీలింగ్ ఫ్యాన్లు, బెంచీలు ఏర్పాటు చేశాము. పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నాం.

– పరవాడ గీతాదేవి, ఎంఈఓ, తుని

ప్రతి మహిళా స్వశక్తితో ఎదగాలి

రౌతులపూడి: ప్రతి మహిళ స్వశక్తితో ఎదిగి ఆర్థిక స్వావలంబన సాధించాలనే లక్ష్యంతో ప్రభుత్వం పని చేస్తుందని డీపీఎం డి.కేశవ్ అన్నారు. గురువారం స్థానిక వెలుగు కార్యాలయంలో మండల మహిళా సమాఖ్య సమావేశం నిర్వహించారు. ఏపీఎం నాగమణి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో మహిళా పొదుపు సంఘాల పనితీరు, సీఐఎఫ్, హెచ్‌డీఐఎఫ్, ఉన్నతి, వీఆర్ఐఎఫ్, బ్యాంకు రుణాల వసూళ్లు, మహిళా సంఘాలకు అందజేస్తున్న వివిధ రుణాల వసూళ్లపై చర్చించారు. ప్రస్తుతం వివిధ లీడ్ బ్యాంకుల ద్వారా పొందుతున్న రుణాల వివరాలు గురించి సమీక్షించారు. క్రమం తప్పకుండా ప్రతి మహిళా సంఘం తమ పొదుపు చెల్లించి, తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లిస్తే తిరిగి రుణాల పొందేందుకు అవకాశం ఉంటుందన్నారు. ఈ సందర్భంగా ఇటీవల ఉన్నతి సంస్థ ద్వారా చిరువ్యాపారాలు చేసుకులా మండలంలోని ములగపూడి, శృంగవరం, ఎస్.పైడిపాలలో ఎంపిక చేసిన లబ్ధిదారులకు ఒక్కొక్కరికి రూ.లక్ష చొప్పున రుణాలకు సంబంధించిన చెక్కులను స్థానిక నాయకులు చేతుల మీదగా అందజేశారు. ఈ కార్యక్రమంలో స్త్రీనిధి మేనేజర్ చిట్టిబాబు, డీపీఎం బాబూరావు, వెలుగు సీసీలు, నాయకులు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాకు నేడు అంతరాయం

తుని: స్థానిక వీరవరపుపేట సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ లైన్ల నిర్వహణలో భాగంగా శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ట్రాన్స్ కో ఈఈ బి.వీరభద్రరావు గురువారం తెలిపారు. పట్టణ పరిధిలోని దివాణం వీధి, గొల్లపేట, బాడవ వీధి, వెంకటేశ్వరస్వామి ఆలయం, వడ్ల బంగారమ్మ వీధి, పాత బజారు, బెల్లపువీధి, నారాయణరాజు గారి వీధి, ప్రకాశం రోడ్డు, ముస్లీం వీధి, చిన్న వీధి, పెద్దవీధి ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

ప్రజా సమస్యలపై స్పందించండి

- ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి

ఏలేశ్వరం: ప్రజా సమస్యలపై స్పందించాలని ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి అధికారులకు సూచించారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో గురువారం ఎంపీపీ అధ్యక్షతన బడ్జెట్, 2024-25 సవరణ బడ్జెట్, 2025-26 అంచనా బడ్జెట్, మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ అధికారులు గ్రామాల్లో నెలకొన్న సమస్యలపై స్పందించి వెంటనే పరిష్కారించాలన్నారు. గ్రామాల్లో తాగునీరు, రహదారులు, డ్రైన్లు, వీధిదీపాలు తదితర అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించామన్నారు. తొలుత ఎంపీటీసీ సభ్యులు యిజనగిరి ప్రసాద్, కొప్పుల బాబ్జీ మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయ సిబ్బంది ప్రజాప్రతినిధులకు ఎటువంటి సమచారం ఇవ్వడం లేదని ఆరోపించారు. కనీసం ప్రొటోకాల్ పాటించడం లేదని దీనిపై వివరణ ఇవ్వాలన్నారు. దీనిపై మండల వ్యవసాయాధికారి జ్యోతి మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయంతో తమ శాఖకు సంబంధం లేదని కేవలం సలహాలు ఇస్తామన్నారు. ఎంపీటీసీలకు ప్రొటోకాల్‌పై ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళతానన్నారు. వచ్చే వేసవిలో తాగునీటి సమస్య లేకుండా చూడాలని ప్రజాప్రతినిధులు కోరారు. అలాగే విద్యుత్ సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. పెద్దనాపల్లిలో సబ్‌స్టేషన్ ఏర్పాటుకు స్థల పరిశీలన చేశామని ట్రాన్స్‌కో ఏఈ సూర్యనారాయణ తెలిపారు. అనంతరం 2025-26 ఏడాదికి గాను ఆదాయం రూ.18,39,79,100, వ్యయం రూ.18,38,27,100 మిగులు రూ.1,52,000 ఆమోదించారు. అనంతరం పంచాయతీలకు స్వచ్ఛభారత్‌లో భాగంగా చెత్త సేకరణకు ట్రాక్టర్లను అందజేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు నీరుకొండ రామకుమారి, ఎంపీడీఓ సూర్యనారాయణ, తహసీల్దార్ కుశరాజు, వైస్ ఎంపీపీ చిక్కాల రాజ్యలక్ష్మి, సాదే లోవరాజు, ఎంపీటీసీలు, సర్పంచులు, అధికారులు పాల్గొన్నారు.

నాణ్యతా ప్రమాణాలు పాటించాలి



రాజుపాలెంలో రోడ్డు నిర్మాణ పనులను పరిశీలిస్తున్న డీఈ రాఘవరావు

కిర్లంపూడి: రోడ్డు నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని పెద్దాపురం ఆర్అండ్‌బీ డీఈ కేఎస్ రాఘవరావు ఆదేశించారు. రాజుపాలెంలో రోడ్డు నిర్మాణ పనులను శనివారం ఆయన పరిశీలించారు. రోడ్డు నిర్మాణంలో ఎత్తు, వెడల్పు, నాణ్యతా లోపాలు తలెత్తకుండా అధికారులు జాగ్రత్త వహించాలన్నారు. ఏఈ సత్యశివప్రసాద్ ఉన్నారు.

మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించాలి



తునిలో ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు

తుని: మహిళలు ఆర్థిక స్వావలంబన సాధిస్తే దేశం ప్రగతి పథం వైపు పయనిస్తుందని యూటీఎఫ్ నాయకురాలు జి.అమ్మతల్లి అన్నారు. గురువారం కొండవారిపేటలో శ్రామిక మహిళా సమన్వయ కమిటీ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన అమ్మతల్లి మహిళలకు ఉన్న హక్కులను వివరించారు. మహిళా న్యాయవాదులు విజయలక్ష్మి, ప్రసన్న, శ్యామల, సీఐటీయూ నాయకులు ధనలక్ష్మి, బ్రహ్మ నాయుడు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

చిట్టిబాబు సేవలు చిరస్మరణీయం



చిట్టిబాబు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే బాపనమ్మ

శంఖవరం: మాజీ ఎమ్మెల్యే పర్వత చిట్టిబాబు ప్రత్తిపాడు నియోజకవర్గానికి చేసిన సేవలు చిరస్మరణీయమని మాజీ ఎమ్మెల్యే పర్వత బాపనమ్మ అన్నారు. స్థానిక గ్రామంలో ఎంపీపీ పర్వత రాజుబాబు స్వగృహంలో చిట్టిబాబు చిత్రపటానికి పూలమాల వేసి వర్ధంతిని నిర్వహించారు.ఈ కార్యక్రమంలో పర్వత వివేక్, మేకల కృష్ణ, పగడాల బాబ్జి, రేలంగి సూరిబాబు.బొమ్మిడి చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి పనులపై నేటి నుంచి సామాజిక తనిఖీ

గండేపల్లి: ఉపాధి హామీ నిధులు రూ.12,29,13,000తో చేపట్టిన 1135 పనులకు గాను శుక్రవారం నుంచి సామాజిక తనిఖీ నిర్వహించనున్నట్టు ఎంపీడీఓ నాతి బుజ్జి తెలిపారు. ఇందుకు సంబంధించి స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధి హామీ పథకం, కన్వర్జెన్సీ డిపార్ట్‌మెంట్స్, ఉపాధి హామీ సిబ్బంది, ఇతర శాఖల అధికారులతో గురువారం సామాజిక తనిఖీ బృందానికి సమన్వయ సమావేశం ఏర్పాటు చేసినట్టు తెలియజేశారు. జరిగిన పనులపై క్షేత్రస్థాయిలో పరిశీలించనున్నారని, సంబంధిత అధికారులు రికార్డ్సను సిద్ధం చేసుకోవాలన్నారు. ఈ తనిఖీలు మండలంలో 14 రోజుల పాటు మూడు బృందాలుగా తనిఖీలు నిర్వహిస్తారన్నారు. ఈ సమావేశంలో ఏపీఓ గంగాభవాని, ఈసీ పి రమేష్, సిబ్బంది పాల్గొన్నారు.

కవలల చదువుకు ఆర్థిక సాయం



కవలలకు నగదు వస్త్రాలు అందజేస్తున్న శ్రీనివాస్, చిత్రంలో సతీష్, బాలికల తల్లి గంగాభవాని

కాకినాడ క్రైం: తండ్రిని కోల్పోయిన కవలల చదువుకు శ్రీ యువసేన స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు మాజీ మంత్రి దాడిశెట్టి రాజా సోదరుడు దాడిశెట్టి శ్రీనివాస్ చేయూత నిచ్చారు. కాకినాడ జగన్నాథపురానికి చెందిన కొప్పిశెట్టి వీరబాబు 2021లో కోవిడ్‌తో 2021లో మృతి చెందారు. ఆ సమయానికి వీరబాబు భార్య గంగా భవాని నిండు గర్భిణి. అనంతరం ఆమె కవలలకు జన్మనిచ్చింది. ఈ విషయాన్ని శ్రీయువసేన వ్యవస్థాపకుడు బొల్లం సతీష్ ద్వారా తెలుసుకున్న దాడిశెట్టి శ్రీనివాస్ ఈ మేరకు వారి చదువుకు తన వంతు సహకరిస్తానని హామీ ఇచ్చారు. మాట ప్రకారం కవలు ఆరాధ్య, అర్పణల పూర్తి చదువు బాధ్యత తీసుకుంటున్నట్లు గురువారం సంస్థ కార్యాలయంలో ప్రకటించి వారి ప్రాథమిక విద్యాభ్యాసానికి అయ్యే ఖర్చుతో పాటు నూతన వస్త్రాలు అందించారు.

దళేకు ముద్రగడ పరామర్శ



దళే చిట్టిబాబును పరామర్శిస్తున్న వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కోఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబు

ప్రత్తిపాడు: పెదశంకర్లపూడి గ్రామానికి చెందిన అన్నవరం ట్రస్ట్‌బోర్డు మాజీ సభ్యుడు దళే చిట్టిబాబును నియోజకవర్గ వైఎస్సార్ సీపీ కోఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబు గురువారం పరామర్శించారు. ఆయన ఇటీవల అస్వస్థతకు గురయ్యారు. దళే చిట్టిబాబు ఆరోగ్య పరిస్థితిని గిరిబాబు అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట మండల ఉపాధ్యక్షుడు ఏనుగు శ్రీను (బంకు శ్రీను), వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ రామిశెట్టి బులిరామకృష్ణ, పార్టీ నాయకులు గుడాల వెంకటరత్నం, శేరు కృష్ణ, జల్లి గంపల ప్రభాకరరావు, గోళ్ళ జయశేఖర్ తదితరులున్నారు.

గుర్రపు డెక్క తొలగించరూ..



గుర్రపుడెక్కతో నిండిపోయిన పిల్లరాజు కాలువ

ప్రత్తిపాడు: మూడు చెరువులకు సాగునీటిని అందించే పిల్లరాజు కాలువలో గుర్రపుడెక్క పేరుకుపోయింది.దీంతో నీరు సక్రమంగా సాగక రైతులు ఇబ్బంది పడుతున్నారు. ఏలూరు గ్రామంలోని వెంకటపతిరాజు చెరువు నుంచి ప్రత్తిపాడు ఊర చెరువుకు సుమారు రెండు కిలోమీటర్ల మేర కాలువ విస్తరించి ఉంది. ఊర చెరువు నుంచి సిద్దావారి చెరువు, దేవులపల్లి వారి చెరుకులకు సుమారు 300 ఎకరాల ఆయకట్టుకు నీరందించాలంటే పిల్లరాజు కాలువే ఆధారం. ఈ కాలువను అభివృద్ధి చేయకపోవడంతో ఏటా రైతులకు సాగునీటి కష్టాలు తప్పడం లేదు. ఈ కాలువ నీరందించే ఊర, సిద్దావారి, దేవులపల్లి వారి చెరువుల ఆయకట్టు చివరి భూములకు సాగునీరందడం లేదు. చేతికొచ్చే దశలో పంటలు ఎండిపోయి రైతులు నష్టాలను చవిచూస్తున్నారు. ఏలూరు వెంకటపతిరాజు చెరువు–ప్రత్తిపాడు ఊర చెరువు మధ్య కాలువో గుర్రపు డెక్క పేరుకుపోయి సాగునీటికి అడ్డుకట్టగా మారిందని రైతులు ఆందోళన చెందుతున్నారు. రెండు దశాబ్దాలుగా కాలువను అభివృద్ధి పరచలేదని ఎంపీటీసీ సీంద్రపు భాస్కరరావు తెలిపారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ప్రస్తుత వేసవిలో కాలువను అభివృద్ధి చేసి, సాగునీటి కష్టాలు తీర్చాలని రైతులు కోరుతున్నారు.

వృథాగా పోతున్న తాగునీరు



అండర్‌పాస్ పైపులైనుకు కనెక్షన్ లేక వృథాగా పోతున్న నీరు



మురుగుకాలువలో వృథాగా పోతున్న తాగునీరు

కోటనందూరు: ఏప్రిల్ రానేలేదు ఎండలు మండిపోతున్నాయి. మంచినీటి కోసం ప్రజలు అష్టకష్టాలు పడాల్సిన దుస్థితి నెలకొంది. ప్రతి నీటిబొట్టును ఒడిసిపట్టి ప్రజలకు అందించాల్సిన అధికారులు నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారు. కేఈ చిన్నపాలెంలో అంగన్‌వాడీ కేంద్రం-1 పరిసర ప్రాంతంలో సరైన మంచినీటి సరఫరా వ్యవస్థ లేక అనేక చోట్ల తాగునీరు వృథా పోతోంది. అండర్‌గ్రౌండ్‌లో ఉన్న పైపులకు కనెక్టింగ్ పైపులు ఏర్పాటు చేయకపోవడంతో భూమిలోని గొట్టాలకు ఆ ప్రాంతం వారు ప్లాస్టిక్ ట్యూబ్‌లను ఏర్పాటు చేసుకొన్నారు. వారి అవసరాలు తీరిన తరువాత అలా వదిలేయడంతో నీరంతా డ్రైనేజీలోకి వృథాగా పోతోంది. చాలా కాలంగా నీరు వృథాగా పోతున్నా అధికారులు పట్టించుకోలేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా పైపులైనుకు మరమ్మతులు చేయాలని ఆ ప్రాంతవాసులు విజ్ఞప్తి చేస్తున్నారు.

నేత్రపర్వంగా వేంకటేశ్వరస్వామి కల్యాణం



పాతకొట్టాంలో వేంకటేశ్వరస్వామి కల్యాణం నిర్వహిస్తున్న వేదపండితులు

కోటనందూరు: పాతకొట్టాంలో ఉన్న వేంకటేశ్వర స్వామి ఆలయ ప్రథమ వార్షికోత్సవ నేత్రపర్వంగా జరిగింది. గురువారం ఉదయం స్వామివారి కల్యాణోత్సవ క్రతువును వేదపండితులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఆలయ ధర్మకర్త బొంగు గోపాలకృష్ణ దంపతులు పీటలపై కూర్చొని కల్యాణ పూజలు నిర్వహించారు. ఈ కల్యాణాన్ని స్థానికులతో పాటు పరిసర గ్రామాల ప్రజలు వేలాదిగా తరలివచ్చి తిలకించి తరించారు. ఆలయం వద్ద మధ్యాహ్నం 4వేల మందికి అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. సాయంత్రం స్వామివారిని గ్రామ ప్రధాన వీధులో ఊరేగించారు.

బహుళ పంటల సాగుతో మేలు



బెండపూడిలో బహుళ పంటల సాగు నిమిత్తం విత్తనాలు కలుపుతున్న ఏపీసీఎన్ఎఫ్ సిబ్బంది

తొండంగి: రబీ అనంతరం ఖరీఫ్ వరి పంటల సాగుకు ముందు బహుళ పంట (నవధాన్య, ఇతర విత్తనాలు మల్టీసీడ్స్) సాగు ద్వారా వ్యవసాయ పంట భూములకు మేలు జరుగుతుందని ఏఈఓ కొప్పన దైవప్రసాద్ అన్నారు. గురువారం బెండపూడిలో ఆంధ్రప్రదేశ్ సంఘ నిర్వాహక ప్రకృతి వ్యవసాయం(ఏపీసీఎన్ఎఫ్), వ్యవసాయశాఖ సంయుక్తాధ్వర్యంలో రైతులతో మల్టీ సీడ్స్ కిట్లు తయారీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కిట్లలో నవధాన్యాలు, కాయగూరలు తదితర అన్నిరకాల విత్తనాలు కలిపి 500 కిలోలు తయారు చేసినట్టు తెలిపారు. ఎకరాకు 10 కిలోల చొప్పున యాభై కిట్లు రైతులకు అందజేస్తామన్నారు. ఒక్కో కిట్టు రూ.800 చొప్పున అందజేస్తున్నామన్నారు. కార్యక్రమంలో గ్రామ సచివాలయాల అగ్రికల్చర్ అసిస్టెంట్, ఏపీసీఎన్ఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.

అటవీ భూముల్లో చెట్లు నరికితే కఠిన చర్యలు

శంఖవరం: అటవీ భూముల్లో చెట్లు నరికితే కఠిన చర్యలు తప్పదని ఫారెస్టు సెక్షన్ ఆఫీసర్ జి.నాగేశ్వరరావు అన్నారు. వజ్రకూటంలో ఆయన మాట్లాడుతూ అటవీ ప్రాంతంలో ప్రభుత్వం అనేక రకాల జాతుల మొక్కలను ప్రభుత్వం పెంచుతుందన్నారు. ఇటీవల కొంత మంది దుండగులు అక్రమంగా చెట్లు నరికివేశారన్నారు. దుండగులపై ఫారెస్ట్ అధికారులు కఠిన చర్యలు తీసుకుంటారని తెలిపారు. అటవీ భూముల్లో కొండపోడులు చేసిన వారిపై చర్యలు తీసుకుంటామన్నారు.

గర్భస్థ శిశు లింగ నిర్ధారణ నేరం

ఆర్డీఓ శ్రీరమణి



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఆర్డీఓ శ్రీరమణి

పెద్దాపురం: గర్భస్థ శిశు లింగ నిర్ధారణ నిషేధ చట్టంపై ప్రజలకు మరింత అవగాహన కల్పించాలని ఆర్డీఓ కె.శ్రీరమణి ఆదేశించారు. స్థానిక ఆర్డీఓ కార్యాలయ చాంబర్‌లో గురువారం డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ పి.సరిత అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ శ్రీరమణి మాట్లాడుతూ అల్ట్రా సౌండ్ వైద్య పరీక్షలను లింగ నిర్ధారణకు ఉపయోగించడం నేరమన్నారు. నిబంధనలకు విరుద్ధంగా ఎవరైనా లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తే కఠిన చర్యలు తప్పవని ఆర్డీఓ హెచ్చరించారు. డాక్టర్ సరిత మాట్లాడుతూ పెద్దాపురం డివిజన్ పరిధిలో స్కానింగ్ కేంద్రాల రిజిస్ట్రేషన్, రెన్యూవల్, డెకాయ్ ఆపరేషన్లు ఆకస్మిక తనిఖీలు చేపట్టనున్నట్టు తెలిపారు. డివిజన్ పరిధిలో 40 స్కాన్ సెంటర్లు ఉండగా వాటిలో 11 ప్రభుత్వ శాఖ పరిధిలో ఉన్నాయన్నారు. మరో రెండు డెకాయ్ ఆపరేషన్లు నిర్వహించామన్నారు. అనంతరం పలు అంశాలపై చర్చించారు. ఈ సమావేశంలో డాక్టర్ అనూషారాయ్, న్యాయవాదులు సత్యవంశీ, ఎన్‌జీఓ సభ్యులు వాసవి, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.